# పంచాక్షరి

కైలాసం, కాశీ వెళ్లాడు:

కారణం: విరక్తి! ఎవరిమీద, – అప్పు పుచ్చుకునే వాళ్ళమీద! – వాళ్ళు – బాకీలు ఎగవేశారా! – ఊహుఁ –

అది కలలో వార్త! – అప్పుకు రావడమే మానేశారు! ఏమో? – ఏం చెప్పమంటారు? – కలికాలం–మునుపటి మానాభిమానాలు నశించినయి! వెనుకటికయితే, – గృహస్తన్నవాడు, – మానుషానికి మ్రగ్గి, – కంఠం మీదికి వచ్చినప్పుడు, – గత్యంతరంలేక – తన దగ్గిరకు వచ్చి ప్రాధేయపడేవాడు! వడ్డీ సంగతంటారా – తన దయ–ముందు పబ్బం గడవడం ప్రధానం!

తనదగ్గిరికే ఎందుకు వస్తారూ అంటే, – ఆ లావాదేవి ఫాలాక్షుడికే తెలియదు: వాడుకున్న ఆసామి – మూడేళ్ళకో పర్యాయం – అసలు ఫాయిదాలు కలిపి, – ఓ కాగితంముక్క గీకి తన మొగాన కొడితే చాలు – మళ్ళీ మూడేళ్ళదాకా దాని జోలీ శొంఠీ తలుచుకోనక్కర లేదు; క్రమేణా అది, గోరింత – కొండంత అయినా, – దానికి తులదూగే ఆస్తిపాస్తులున్నంత వరకూ, – తను నిశ్చింత – పుచ్చుకున్న వాడికి దుర్బుద్ధి పుట్టి – కొంతసొమ్ము జమవేదా మనుకున్నా, – తాను పుచ్చుకునేందుకు, – ఓపట్టాన ఒప్పుకునే వాడుకాదు; 'ఏం బాబూ నలుగురున్న సంసారం – కాలు కదిలిస్తే ఖర్చు! చేతిలో ఉన్న రవంతా నాకిస్తే మీకు ఇబ్బందికదూ? – నేనేం నూరుకు తాగుతానా, – మరో అయ్య చేతులలో పెట్టవలసిందేగా? – నీ దగ్గిరే ఉండనిద్దూ బాబూ!–' అని బతిమాలుకుని, – మొహమాట పెట్టి తిప్పి పంపించేవాడు! చివరకు, – ఏదో ఒకనాటికి, – ఆస్తికీ అప్పుకూ సరిపోతుందనుకున్నప్పుడు, – అప్పుడూ మాంచిగానే,– అంత గోప్యంగానే – అది – తన ఆస్తిలో కలుపుకునేవాడు; అలా తిరు – మంగళం చేసి, – అంతటితో వదిలేవాడా? – ఊహుఁ –

బాబూ, – యీ పద్దు, – యింతటితో రద్దు! – కాని కాతా సాగుతూండ వలసిందే! అక్కరున్నప్పుడు అడగండి! వీలున్న కొద్దీ సర్దుతూంటాను. ఎల్లకాలం రోజు లిలాగే ఉంటాయా? కొబ్బరి బోండాంలోకి నీరొచ్చినట్టు – మనకు, తెలియకుండానే ఏ మూలనుంచో కలిసొస్తుంది! – మీరేం మొగమాటపడద్దు: కాచి వడబోయక పోయినా, నాకూ, – కష్టసుఖాలు తెలుసు! – అని బుజ్జగించి, – పాతికడిగినప్పుడు పరకా, – పదడిగినప్పుడు ఐదూ, – అలా సర్దుతూండేవాడు! అది అలా పెరుక్కుంటూ రాగా, – చివరకు ఆసామీకే మొగం చెల్లక, – యిటు రావడం మానేసేవాడు!

అలా మంచిగా, పెంచిన ఆస్తి, తండ్రి తనకిచ్చిపోయింది – మూడు సంచులు!

యిప్పుడున్న భూమి పుట్రా కలిపి మూడు లక్షలు – వ్యాపారం సజావుగా సాగితే కోటికి పడగెత్తడం, – చిటికల్లో పని, – కాని, –

మనుషులు మారలేదు కాని, బుద్ధులు మారినయి! యిప్పుడు, – ఎంత మోతుబరి కానీ, – అవసరం వస్తే, – వందక్కానీ, పదొందలక్కానీ, బాకీకి పరుగెత్తుతున్నారు! సిగ్గూ, బిడియం లేకపోయె! పైగా, – యింకో దుర్బుద్ధి, – మునుపటి రోజుల్లో అంటే ఆస్తిమీద అప్పుచేసి, – హాయిగా రాజాలాగా అనుభవించేవారు! యిప్పుడు – అప్పుచేసి, – ఆస్తులు కొంటున్నారు! ఆ బాకీ కడుపుకట్టుకుని తీరుస్తున్నారు! ఛీ! – ఎప్పుడైతే ఆసామికి బాకీ తీర్చవలెననే తపన పుట్టిందో – అది లోకానికి చేటుకాలం! తనలాటివాళ్ళు – యీ భూమిమీద యిహ ఉండటం అనవసరం! – కనుక –

కాశీలో ఆత్మహత్య చేసుకుందామని, – నిశ్చయించుకున్నాడు! మరి యిక్కడ యీ కామాటం! తానున్నట్లే సాగుతూంటూంది! తన వైనం ఆ విశ్వనాధుడికి తప్ప మరో నరమానవుడికి తెలియనక్కరలేదు! ఊరి మీదున్న దానికేం గాని, – యింట నిల్వ రొఖ్ఖం ఐనూరు! ఆత్మహత్యకని బయలు దేరుతున్నా రొంటినో ఐదొంద లుండటం మంచిది; అనుకుని ఆ మాత్రం మూటపై మూటకట్టి – పీటముడి వేశాడు:

రైలుదిగి, – అందరితో బాటు గంగపూజ చేసుకుని, – ఆ యింజను క్రిందనే పడదా మనుకున్నాడు, – కాని, మేరు పర్వతంలాగా వస్తూన్న ఆ బండి కాస్తా, – అల్లంత దూరంలో పట్టాలు తప్పింది – ఛప్ లేచినవేళ మంచిది కాదనుకుని, – ఒక ఏనుగంత కారుకు ఎదురెళ్ళాడు; అది బెదిరి, – గింగిర తిరిగి, – పక్కగోడకు కొట్టుకుని, ఎత్తునబడింది! యీవాళ అన్నీ యిలా ఎదురు తిరుగుతున్నా యేమా? – ఆ గుళ్లో వాడిని కనుక్కుందామని పోతున్నాడు!

ఎదురుగుండా ఓ సాధువు చే జాపాడు! ఎందుకు? ఓ పావలిబ్బులిస్తే జ్ఞానపత్రి కొనుక్కుంటాట్టా!

వాడికి రోజుకు ఎంత ఖర్చు

ఓ రూపాయుంటే బ్రహ్మానందం

సరి, – మరి ఆదాయం!

యిలా చేజాచటమే,

రోజుకు ఏమాత్రం గిట్టుబాటు?

అదో గాలివాటు! ఒకటే రావచ్చు, రెండు రావచ్చు, – ఒక్కొక్కనాడు పైసా రాలకపోవచ్చు!

ఆనాడు? – పస్తే!–

ఛస్! అది తప్పు! జ్ఞానికి జ్ఞానపత్రి లేకపోవడమా? –

స్వామీ! నే నిస్తాను రూపాయి, – ఎల్లుండికి – మరో పావలా వేసి యిస్తావా?–

మనం, – యీ బాదరబందీ పడలేం!–

అవసరం ఉంటే అడుగుతాం!–

అప్పటికప్పుడు భస్మం చేస్తాం!–

అంతే, – యీ లావాదేవీలు!–

తప్పవు స్వామీ! ఆ విశ్వనాధుడికే తప్పలేదు! మీకు జ్ఞానపత్రిలాగానే – వారికి అభిషేకాలూ, పూజలు కావాలి! అందుకు మారుగా, – వారు వరాలిస్తున్నారు! మీరు వడ్డీ యిస్తున్నారు! యీ భూమ్మీదంటూ ఉన్న తరువాత, – దేవుడైనా సరే, – జ్ఞానైనా సరే – యీ యిచ్చి పుచ్చుకోవడాలుండ వలసిందే! –శివుడు పెళ్ళి ఖర్చుల నిమిత్తం, కుబేరుడి దగ్గిర చేబదులు చేయలా? –

నీవు చేస్తే తప్పా! నా మాట విను! మీ లాటివారికి సాయం చేసే పుణ్యం నాకు దక్కించు! – మెట్టుకు ఒప్పించాడు!

ఒకడి కొకరై, – ఖాతాదారు లెక్కివచ్చారు! సొమ్ము, జ్ఞానపత్రిగా కాశీక్షేత్ర మంతటా కలయ దిరుగుతూ – తనకు పరిగేరుతూంది! యింత జంజాటం తా నొక్కడూ నిభాయించలేక చేతిక్రింద యిద్దరిని వేసుకున్నాడు!

వ్యాపారం మరింత ముదిరింది. యందులో యీ దళారీ తనం ఎందుకని, – తానే జ్ఞానపత్రి వ్యాపారం మొదలెట్టాడు! అందులో బాగా కలిసొచ్చింది! తా నుంటూన్న మాడిగ అమ్మకానికొస్తే, క్రయం చేయించుకున్నాడు – ఆపై మిద్దెమీదనుంచి, – రోజూ రాత్రిపూట మేళతాళాలు వినవస్తూన్న – పనితొందరలో వినిపించుకోలేదు! ఆ నెలాఖరున, బాడిగ, పుచ్చుకుందామని, – పైకి వెళ్లాడు!

అక్కడో ముత్యం ఉంది! తాను పెద్దవాడు కనుక, – ఆ ఛాయాలోనే అనూపానూ అడిగి తెలుసుకున్నాడు! అంటే ఆదాయం విషయం! అవసరం వస్తే, – చేబదులు అడగడానికి సంకోచించ వద్దని చల్లనిమాట జార విడిచాడు! – ముత్యం తళుక్కున నవ్వింది. కాకిచేత కబురుచేస్తే, – కనక వర్షం కురుస్తోంది, – నాకు చేబదు లెందుకండి! – ఔరా! – యీ తీరు, – అంత లాభసాటా అనుకున్నాడు –

ముత్యం – స్వంత భవనంలోకి వెళ్ళిపోయింది – తాను వెళ్ళి చూశాడు! యింద్రభోగం! – ఆలయానికి పోదాం రమ్మంది – మాట తీసెయ్యలేక సరే నన్నాడు!

స్వామి దర్శన మిచ్చాడు, – తనకు, – అక్కడికి వచ్చిన యిరవయ్యేళ్ళకు! – యింతకాలం, – యీ రవంత దూరం రావడానికి తీరుబడి లేకపోయింది. కారులో ఆ చిన్నదాని సరసను కూర్చున్నప్పుడు కూడా; విశ్వనాథా! – నాకు జన్మరాహిత్యం, – వద్దు, – యీ కాశీలో టంచన్ గా పుట్టించు! అని కోరుకుని, – తాను ఆడకూతురైతే, – అహో ఏమా అందం! – అని నవ్వుకున్నాడు–

స్వామిని చూశాడు: సర్వం మరచాడు!

మరి, నరులకంట బడక, – మాయమైనాడు; కేదారేశుని సన్నిధిలో, – ఒకరిద్దరు చూశారు అంతే;–

–తరుణం రాగా, – ముత్యానికి మరో ముత్యం బుట్టింది, –

* * *